క్లుప్తంగా

అంధకారంలో డీఆర్ఎం కార్యాలయం రోడ్డు



చీకట్లు అలుముకున్న డీఆర్ఎం కార్యాలయం రోడ్డు

అల్లిపురం : వారం రోజులుగా దొండపర్తి జంక్షన్‌లోని డీఆర్ఎం కార్యాలయం నుంచి సౌత్ జైలురోడ్డు బీఆర్ రెడ్డి జంక్షన్ వరకు అంధకారం అలుముకుందని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. చీకటి పడితే చాలు ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగక పోవటంతో ముఖ్యంగా పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో ఎవరు ఎటువైపు నుంచి వచ్చి దాడికి పాల్పడతారో అర్థం కావటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒంటరిగా నడిచి వెళ్లేందుకు భయంగా ఉందని, వీధి దీపాలు ఉన్నప్పటికీ అన్నీ వెలగక చీకటి అలుముకుంటోందని తెలిపారు. వెలిగిన వాటికి కూడా చెట్ల కొమ్మలు అడ్డుపడి సరిగ్గా వెలుతురు రావటం లేదని తెలిపారు. రోడ్డు పెద్దది కావటంతో వీధి దీపాలు చిన్నవి బిగించడం వల్ల కూడా తగినంత వెలుగు ఉండటం లేదని తెలిపారు. ఇక్కడ పెద్ద దీపాలు ఏర్పాటు చేయాలని పాదచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ రమణమూర్తి

సీతమ్మధార : కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఆస్పత్రి ఆవరణలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ రోగికి పరామర్శ



రుషిత్‌సింగ్‌ను పరామర్శిస్తున్న రవికుమార్

మహారాణిపేట : కేజీహెచ్‌లో డెంగ్యూ వ్యాధికి చికిత్స పొందుతున్న రోగిని ఆదివారం బీజేపీ మెడికల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ పరామర్శించారు. డెంగ్యూ వార్డులో ఉన్న రుషిత్ సింగ్ (14) గత కొద్ది రోజుల నుంచి డెంగ్యూ వ్యాధికి చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ వైద్యులతో మాట్లాడారు. రుషిత్ సింగ్‌కు మెరుగైన వైద్యం అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లపు శ్రీను, లక్ష్మీ కౌర్, టి.అవతార్ సింగ్, యువమోర్చా ప్రతినిధి గేదెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక నెల పండగ

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు పెద్దకొత్తూరులో ఆంధ్ర యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూకాంబిక అమ్మవారి నెల పండగ ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, కార్పొరేటర్లు కె.కామేశ్వరి, అల్లు శంకరరావు, చంద్రమౌళి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల



చదువుల తల్లి నీడలో పేద విద్యార్థినులు



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థినులతో అధ్యాపకులు

చదువుల నిలయం.. భవిత బంగారం

భవితను బంగారుమయం చేసేది విద్యే. పాఠశాల, కళాశాల స్థాయిలో చక్కగా చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు. అయితే నేటి చదువులు వ్యాపారమయం అయిపోవటంతో పేదలకు విద్య అందరాని ద్రాక్షగా మారిపోయింది. ఈ దశలో జైల్‌రోడ్డులో ఉన్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేవలం పేద విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దే లక్ష్యంతోనే పని చేస్తోంది. నాటి ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వై.ఎస్. రాజశేఖరరెడ్డి వంటి పుణ్యాత్ముల చొరవ వల్ల ఎక్కడో బీచ్‌రోడ్డులోని హవామహల్‌లో ప్రారంభమైన ఈ కళాశాలను నగర నడిబొడ్డున గల జైల్‌రోడ్డుకి తరలించారు. ఈ దశలో దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఈ కళాశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు సరపడా నిధులు మంజూరు చేయటంతో ఈ కళాశాల దినదినప్రవర్ధమానమవుతూ నేడు శాఖోపశాఖలుగా విస్తరించి.. ఇక్కడ చదువుతున్న విద్యార్థినులను విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగంతో పాటు వారు మక్కువ చూపే అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతోంది. ఇక్కడ చదివిన విద్యార్థినులు డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులుగా నేడు సేవలందిస్తున్నారు.

- విద్యార్థినులకు చక్కటి విద్యనందిస్తున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- తొలుత బీచ్‌రోడ్డు హవామహల్‌లో ప్రారంభం
- దివంగత నేత వై.ఎస్. చొరవతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి



జవహర్ నాలెడ్జి కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



పేద విద్యార్థినుల చదువుల నిలయం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

డాబాగార్డెన్స్ : చదువు కోసం భారీగా ఖర్చు పెట్టలేని పేద, మధ్య తరగతి తల్లిదండ్రులకు ఆ విద్యా నిలయం కొండంత అండగా నిలుస్తోంది. వారికి గుండె ధైర్యాన్నిస్తోంది. కార్పొరేట్ కళాశాల స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తోంది. విద్యార్థినులకు చదువే కాక క్రమశిక్షణ కూడా అలవాటు చేస్తూ భవిష్యత్తులో వారి అభివృద్ధికి ఆసరా ఇస్తోంది. క్రీడా, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా మెరికల్లా వారిని తీర్చిదిద్దుతోంది. ఆహ్లాదకర వాతావరణం, పచ్చని చెట్లు, విశాలమైన తరగతి గదులు, చక్కటి కంప్యూటర్ ల్యాబ్‌తో కళాశాల నడుస్తోంది. నగరం నడిబొడ్డున ఉన్న విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల అమ్మాయిలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పాత జైలు స్థలంలో విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల, పీజీ కళాశాల నడుస్తున్నాయి. 1992 నుంచి దినదినాభివృద్ధి చెందుతున్న ఈ కళాశాల ఎందరికో దారి చూపుతోంది. ఏడాదికేడాది సరికొత్త గ్రూపులు ఏర్పాటు చేయడమే కాక పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేలా శిక్షణనిస్తోంది. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా విద్యాభ్యాసం జరుగుతోంది. నిపుణులైన అధ్యాపక బృందం విద్యను అందిస్తోంది.

ఉన్నత శిఖరాలకు..

ఈ కళాశాలలో చదివిన విద్యార్థినుల్లో అనేక మంది ఉన్నత చదువులు చదివారు. రాజకీయాలు, క్రీడాకారిణులుగా వెలుగొందారు. జాతీయ స్థాయి పోటీల్లో నిలిచారు. డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు.. ఇలా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఇదే కళాశాలలో చదువుకున్నారు. 1977లో ఇదే కళాశాలలో సోషల్ వర్క్‌లో డిగ్రీ పూర్తి చేసిన లావణ్య అనే విద్యార్థిని ప్రస్తుతం ఇదే కళాశాలలో లెక్చరర్‌గా కొనసాగుతున్నారు.

వైఎస్సార్ చొరవతో ప్రగతి..

1992లో పాత జైల్‌రోడ్డులో ఉన్న బాలల (కౌమార) సంస్కరణాలయానికి కళాశాలను బదిలీ చేశారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1992 మార్చి 28న కళాశాల నూతన ప్రాంగణాన్ని ప్రారంభించారు. అప్పట్లో షెడ్లులోనే ఇంటర్మీడియట్, డిగ్రీ తరగతులు జరిగేవి. 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి నిధులు మంజూరు చేసి నూతన భవనానికి శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దారు.

హవామహల్‌లో ప్రారంభం..

బీచ్‌రోడ్డులో ఉన్న హవామహల్లో రెండు దశాబ్దాల కిందట మహిళా కళాశాల ఉండేది. పేద పిల్లలు చదువుల్లో రాణించాలన్న ఉద్దేశంతో సింగవరపు సూర్యారావు కళాశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవంతో ఆయన కళాశాలను తీర్చిదిద్దారు. హవామహల్‌కు అప్పట్లో నెలకు రూ.800 అద్దె చెల్లించేవారు. అనివార్య కారణాల వల్ల 1990లో ఈ కళాశాలను వుడా బిల్డింగ్‌లోకి తరలించారు. 1992లో ఇప్పుడున్న చోటుకు మార్చారు.

ఎయిడ్స్ మృతులకు నివాళి



ఎయిడ్స్ మృతులకు నివాళి అర్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట : ఎయిడ్స్‌తో మృతి చెందిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియచేద్దామని, వారి కుటుంబ సభ్యులకు ఉపశమనం కలిగిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఆదివారం 'అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యంజలి దినం'నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. రేసవానిపాలెం వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ సత్యం కూడలి, రామాటాకీసు వరకు సాగింది. ఈ సందర్భంగా పలువురికి న్యూట్రిషన్ పౌడర్ అందజేశారు. అనంతరం హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, పలు విభాగాల అధికారులు శైలజ, భద్రి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

డాబాగార్డెన్స్ : అభయ ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ వ్యవస్థాపకుడు అభిషేక్ అధ్వర్యంలో ఆదివారం రెండు వేల మందికి పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోన శంకర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్, ట్రస్ట్ సభ్యులు గణేష్, సునీల్, నిఖిల్, మణికంఠ, నీలధర్, పవన్, నవీన్, శ్రీనివాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'పుచ్చలపల్లి'కి ఘన నివాళి

డాబాగార్డెన్స్ : పాతాళానికి తొక్కినా తిరిగి ఆకాశానికి ఎగరగలిగిన శక్తి కమ్యూనిజానికి ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పురస్కరించుకొని 'మతోన్మాదం–రాజ్యాంగం–ప్రస్తుత సవాళ్లు' అనే అంశంపై ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో స్మారకోపన్యాసం చేశారు. ముందుగా పుచ్చలపల్లి చిత్రపటానికి పలువురు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికను రాసినప్పుడు కమ్యూనిజానికి భూతం ఆవరించిందంటూ అమెరికా వ్యంగ్యాస్త్రాలు రాసిందన్నారు. కానీ వాస్తవానికి అమెరికాకే ఈ రోజు భయం అనే భూతం ఆవరించిందన్నారు. ప్రస్తుతం భారతదేశంలో ప్రధాని మోదీ ఎక్కడైనా చైనాను తిట్టకుండా ఉండడం లేదన్నారు. ఈ రోజు భారతదేశంలో విదేశీ వ్యాపారంలో ప్రధానంగా ఉన్నది చైనానే అన్నారు. 1920–29 మధ్య కమ్యూనిజాన్ని బలంగా తొక్కేయాలని చూసినప్పుడు సుందరయ్య వీరోచిత పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం ట్రస్టీ కార్యదర్శి డాక్టర్ బి. గంగారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎ. అజశర్మ, రెడ్డి వెంకట్రావు, ఆర్‌కే ఎస్‌వీ కుమార్, ఈశ్వరమ్మ, జగన్ పాల్గొన్నారు.



పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

ఘనంగా ఎర్నిమాంబ జాతర



మూలవిరాట్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జ్ఞానాపురం, అల్లిపురం ప్రజల ఇలవేల్పుగా కొలిచే ఎర్నిమాంబ అమ్మవారి జాతర ఆలయ ఈవో డీవీవీ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులుతీరారు. అమ్మవారిని దర్శించుకుని.. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పూలఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు సుమారు 252 అమ్మవారి ప్రతిమలతో దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేలవేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పలు సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ చైర్మన్, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా బల్లిగిరి వెంకన్న వార్షిక తిరు కల్యాణం
- గోవింద నామస్మరణతో మార్మోగిన బల్లిగిరి



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి



కన్యాదానంలో పాల్గొన్న ఈవో రమాబాయి, ధర్మకర్తల మండలి చైర్మన్ బొడ్డేటి కిషోర్



కల్యాణంలో పాల్గొన్న దంపతులు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చిరు మొగ్గల సిగ్గులొలికే బుగ్గలతో, పసిడి కాంతులీనుతూ.. పెండ్లి కూతుళ్లుగా, బుగ్గన చుక్కతో దేవేరులు శ్రీదేవీ, భూదేవీల మధ్య ముగ్ధ మనోహర రూపంలో కాంతులీనుతున్న వెంకన్న స్వామి కల్యాణ వైభోగం చూసిన వారు ధన్యులయ్యారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అంకురార్పణ, గరుడ పతాక ధ్వజస్తంభ అధిరోహణ, విశేష హోమాలను ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి తిరుకల్యాణోత్సవం సందర్భంగా తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ తరఫున ఆలయ ఈవో జీవీ రమాబాయి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు గొడవర్తి రఘునాథశర్మ పర్యవేక్షణలో ఆగమ పండితులు స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న జంటలు కల్యాణం జరిపించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు చేసిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. అనంతరం కల్యాణ దంపతులను వేదపండితులు ఆశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా దుర్గమాంబ ఉత్సవం





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు
దుర్గమాంబ నిజరూపం (ఇన్‌సెట్)

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం శాంతినగర్ వాసుల ఆరాధ్యదైవం దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం ఆలయ ధర్మకర్త ఎరిపిల్లి అప్పారావు నేతృత్వంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 16 గ్రామాల ఇలవేల్పుగా కొలుచే దుర్గమ్మను భక్తులు అధిక సంఖ్యలో వేకువజాము నుంచే దర్శించుకున్నారు. పసుపు, కుంకుమలతో విశేష అభిషేకాలు పూజలు జరిపారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలీసుల బందోబస్తు నడుమ ఉత్సవాన్ని జరిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా నా క్లయింటు అయిన శ్రీ అనిల్ కుమార్ శర్మ, S/o శ్యామ్ సుందర్ శర్మ, యిచ్చిన బోగట్టా మేరకు అయనకు విశాఖపట్నం జిల్లా, చినగదిలి మండలం, మధురవాడ గ్రామములో చేరిన సర్వే నెం. 26రు గల వుడా ఎల్.పి.నెం. 37/91, ప్లాట్ నెం. 59ఇలో 267 చ॥గ॥ లేక 223.212 చ॥మీ॥ల ఖాళీ స్థలం కలదు. సదరు ఆస్తికి అనిల్ కుమార్ శర్మ గారు యజమాని అయివున్నారు. యీ ఆస్తి క్రయ దస్తావేజు తేది: 26-02-2004న డాక్యుమెంటు నెం. 654/2004రు ద్వారా దఖలుపడినది. సదరు ఆస్తి యొక్క లింకు డాక్యుమెంటు అయిన క్రయ దస్తావేజు తేది: 13-12-1999న డాక్యుమెంటు నెం. 1303/99రు మరియు దీని లింకు డాక్యుమెంటు అయిన క్రయ దస్తావేజు తేది: 20-02-1995న డాక్యుమెంటు నెం. 470/95రు. సదరు యీ రెండు లింకు డాక్యుమెంట్స్ తేది. 10-5-2024 ఉదయం 10:30 గం॥లకు డాబాగార్డెన్స్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వెళ్తుండగా మార్గమధ్యలో పోయినవి. సదరు డాక్యుమెంట్స్ దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి గాని మరియు ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు. మీరు చేసిన సహాయమునకు తగిన పారితోషకము యివ్వబడగలదు.

ఎం.వి.జగన్నాథరావు, అడ్వకేట్,
జిల్లా జడ్జి కోర్టు ఎదురుగా, ప్రకాశరావుపేట,
ఎస్.బి.ఐ. కోలనీ, విశాఖపట్నం-530020
సెల్: 8074599693

సాధనతోనే కళాకారులుగా రాణింపు



జ్యోతి ప్రజ్వలనతో పోటీలు ప్రారంభిస్తున్న సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు

సీతంపేట: సరస్వతి అమ్మవారి ప్రతిరూపంగా సంగీతం ఆవిర్భవించిందని సంగీత విద్వాంసుడు ద్వారం త్యాగరాజు అన్నారు. అన్నమాచార్యుని జయంతిని పురస్కరించుకుని శృతిలయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ సారథ్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా త్యాగరాజు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కళాకారుడికైనా భక్తి, శ్రద్ధ, ఏకాగ్రత, సాధన ఎంతో అవసరమని, సాధనతోనే ఉత్తమ సంగీత కళాకారులుగా రాణిస్తారన్నారు. తేనె వంటి తెలుగు పదాలతో వేంకటేశ్వర స్వామిని సంకీర్తన రూపంలో కీర్తించిన ఘనత అన్నమాచార్యుడికే దక్కిందన్నారు. మంచి కార్యక్రమం నిర్వహించారని శృతిలయ సంస్థ వ్యవస్థాపకులను అభినందించారు. ఈ నెల 23న అన్నమాచార్య జయంతి రోజున విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో సుమారు 300 మంది కళాకారులు సంగీతంపై తమకున్న ప్రతిభ చాటారు.

కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, శృతిలయ సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కొణతాల రాజు, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సిహెచ్.వి.సత్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి, కె.మంజుల, శారద, సుజని పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌కు రక్షణ కరువు

సీతంపేట: బ్యూటిఫికేషన్‌లో భాగంగా జీవీఎంసీ 25వ వార్డు సత్యం జంక్షన్ వద్ద గ్రీన్‌బెల్ట్‌ను వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, గ్రీనరీతో సుందరంగా తీర్చిదిద్దారు. గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా మొక్కలు నాటేందుకు మూడు నెలల కిందట ఫెన్సింగ్ తొలగించారు. మొక్కలు నాటే పనులు పూర్తయ్యాక ఫెన్సింగ్‌ను మాత్రం పునరుద్ధరించలేదు. దీంతో సత్యం సెంటర్ వద్ద హైవేకు ఆనుకొని గ్రీన్‌బెల్ట్‌కు ఫెన్సింగ్ తొలగించి ఉండటంతో రక్షణ లేకుండా పోయింది. రాత్రి పూట ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఓపెన్ జిమ్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ గేట్ వెల్డింగ్ ఊడిపోయింది. సంబంధిత అధికారులు పరిశీలించి గ్రీన్‌బెల్ట్‌కు ఫెన్సింగ్‌తో రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.